క్లుప్తంగా

విస్తృత తనిఖీలు


ఎరువు బస్తాను తూకం వేస్తున్న ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరకుమార్

కర్నూలు (న్యూసిటీ): తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదోనిలో పలు దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బుధవారం ఆ శాఖ ఇన్‌స్పెక్టర్ పీవీఎం పరమేశ్వరకుమార్ ఆదోనిలోని ఎల్‌బీ కాలనీ, శ్రీనివాస సెంటర్, పాత బస్టాండ్ వద్ద ఉన్న రైస్, కిరాణ, ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేశారు. కాటాలకు ముద్ర, వస్తువుల ప్యాకేజీలపై గడువు ప్రింట్ లేనందున 7 కేసులు నమోదు చేశామన్నారు. ఎరువుల దుకాణంలో బస్తాకు 1.5 కేజీ వరకు తూకం తక్కువగా ఉండడంతో కేసు నమోదు చేసి రూ.52 వేలు జరిమానా విధించామన్నారు. తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ భూములను కాపాడాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఆక్రమణకు గురవుతున్న ఆలయాల భూములను ప్రభుత్వం కాపాడాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కగ్గోలు హరీష్‌బాబు కోరారు. బుధవారం వీహెచ్‌పీ, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నగరంలోని జొహరాపురం నీలకంఠేశ్వరస్వామి భూమిని కొందరు పేదల పేరుతో ఆక్రమిస్తున్నారని రెండు నెలలుగా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదన్నారు. దూపాడులోని శ్రీలక్ష్మీజగన్నాథ ఆలయ భూముల్లో అక్రమ కట్టడాలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. వెంటనే అక్రమ కట్టడాలను కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. జగన్నాథ గట్టు భూములను రిజిస్ట్రేషన్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బైరెడ్డి శబరి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ వార్డెన్‌పై చర్యలు తీసుకోండి


సంక్షేమభవన్‌లో ధర్నా చేస్తున్న విద్యార్థులు

కర్నూలు(అర్బన్): విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న నగరంలోని కళాశాల ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం సంక్షేమభవన్ వద్ద ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేష్, జి.మునిస్వామి మాట్లాడుతూ హాస్టల్ బాత్రూములు శుభ్రం చేయలేదని, రూములకు తాళాలు వేసి విద్యార్థుల సామాన్లు వార్డెన్ బయటకు విసిరేశారన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే 100కు ఫోన్ చేసి పోలీసులను పిలిపించి విద్యార్థులపై ఫిర్యాదు చేశారన్నారు. పోలీసులు కూడా విద్యార్థులపై చేయి చేసుకోవడం దారుణమన్నారు. జరిగిన ఘటనపై విచారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నాలో నగర సహాయ కార్యదర్శి ఎస్ విజయ్, ప్రసాద్, మధు, అశోక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యాలయ పర్యవేక్షకులు మనోహర్‌కు వినతి పత్రం అందించారు.

కరాటే క్రీడలో రాణించాలి


కరాటేలో బెల్ట్‌లు సాధించిన వారిని అభినందిస్తున్న రామాంజనేయులు

కర్నూలు(రూరల్):కరాటే క్రీడలో రాణించాలని ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు సూచించారు. బుధవారం నగరంలోని వెంకటరమణ కాలనీ గుడ్ షప్పర్డ్ స్కూల్‌లో కరాటే బెల్ట్ గ్రేడింగ్ ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర సాధన ద్వారా మంచి నైపుణ్యం సాధించవచ్చన్నారు. బ్లాక్ బెల్ట్‌లు సాధించిన క్రీడాకారులను అభినందించారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు కోలా ప్రతాప్, తులసిరెడ్డి, నందిని పాల్గొన్నారు.

ఎస్‌డీపీఐ ఆవిర్భావ దినోత్సవం

కర్నూలు(సెంట్రల్):సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎస్‌డీపీఐ) ఆవిర్భావ దినోత్సవాన్ని నగరంలోని మౌలానా అజాద్ చౌక్ బజార్‌లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను నగర అధ్యక్షుడు అశ్వక హుస్సేన్ ఆవిష్కరించారు.అనంతరం 40 మంది ఎస్‌డీపీఐ కార్యకర్తలు రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా జలీలా అహ్మద్, రషీద్, హబీబీఖాన్ పాల్గొన్నారు.

ఆనందం 'మూడింతలు'

- రిసోర్స్ పర్సన్ల జీవితాల్లో వైఎస్సార్‌సీపీ వెలుగులు
- అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనం రూ.3 వేల నుంచి రూ.10 వేలకు పెంచిన ప్రభుత్వం
- 294 కుటుంబాలకు లబ్ధి

పొదుపు సంఘాలను బలోపేతం చేసి.. పొదుపు సభ్యులకు బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పించి.. వారి ఆర్థికాభివృద్ధే పరమావధిగా విధులు నిర్వహించే పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ రిసోర్స్ పర్సన్ల జీవితం ఐదేళ్ల క్రితం వరకు దుర్భరంగా ఉండేది. వారి పరిస్థితిని ప్రజాసంకల్ప పాదయాత్రలో తెలుసుకున్న అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలించిపోయారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట మేరకు ముఖ్యమంత్రి పదవి చేపట్టిన అనతి కాలంలోనే మూడింతల వేతనాలు పెంచి వారి జీవితాలను నెలబెట్టారు. – కర్నూలు(టౌన్)

పట్టణాల్లో పేదరికాన్ని నిర్మూలించడం, మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా వారికి లబ్ధి చేకూర్చడంలో మెప్మాలోని రిసోర్స్ పర్సన్ల పనితీరు కీలకం. వీరంతా మెప్మా సంస్థకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటారు. కీలకంగా విధులు నిర్వహిస్తున్న వీరికి ఐదేళ్ల క్రితం వరకు నెలకు రూ.3 వేల వేతనం మాత్రమే ఇచ్చేవారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విధులు నిర్వహిస్తున్నా చాలీచాలనీ వేతనాలు ఇస్తుండటంతో వారి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడేవి. అప్పటి ప్రభుత్వాలు వారి విన్నపాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇచ్చే అరకొర వేతనాలు కూడా నెలనెలా సక్రమంగా అందేవి కావు. మూడు నెలలకో, ఆరు నెలలకో ఒకసారి అందేవి. ఇదే విషయాన్ని ప్రజా సంకల్ప యాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన అండగా ఉంటానని హామీ ఇచ్చారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే


పొదుపు గ్రూపు మహిళలకు సూచనలిస్తున్న మెప్మా రిసోర్స్ పర్సన్లు

రిసోర్స్ పర్సన్ల వేతనాలు మూడింతలు పెంచారు. దీంతో తమకు ఇంతటి ఆనందాన్ని ఇచ్చిన జగనన్నను గుండెల్లో పెట్టుకుని రెట్టించిన ఉత్సాహంతో విధులు నిర్వర్తిస్తున్నారు.

రిసోర్స్ పర్సన్ల విధులివే..

నగరంలోని 52 వార్డుల పరిధిలో 6,700 గ్రూపులు ఉన్నాయి. ఈ పొదుపు గ్రూపులను మరింత బలోపేతం చేయడం, ప్రతి నెలా సమావేశాలు నిర్వహించడం, బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించడం లాంటి ఎన్నో పనులు చేయాల్సి ఉంటుంది. మెప్మా, ప్రభుత్వానికి, మహిళా సంఘాలకు అనుసంధాన కర్తలుగా వ్యవహరించాల్సి ఉంటుంది. కర్నూలు నగరంలో మొత్తం 294 మంది రిసోర్స్ పర్సన్లు పనిచేస్తున్నారు. మొత్తంగా ప్రతి నెల రూ.3 వేల నుంచి మూడింతలు వేతనాలను ప్రభుత్వం పెంచింది. నాలుగేళ్లుగా వీరికి ప్రభుత్వం నుంచి రూ.8 వేలు, స్లమ్ లెవల్ ఫెడరేషన్ల నుంచి రూ.2 వేలు కలిపి ప్రతినెలా రూ.10 వేలు వేతనాలు అందుతున్నాయి. వీరందరికీ ప్రభుత్వం నేరుగా రిసోర్స్ పర్సన్ల అకౌంట్లలోనే వేతనాలను జమ చేస్తుంది. ఒక్కసారిగా మూడింతలు వేతనాలు పెంచడంతో రిసోర్స్ పర్సన్లు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుటుంబం గడవడం కష్టంగా ఉండేది



రూ.3 వేల వేతనంతో కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. అయినా తప్పని పరిస్థితుల్లో పనిచేసుకుంటూ వచ్చాం. మా శ్రమను జగనన్న గుర్తించారు. నాలుగేళ్ల క్రితం వేతనాన్ని మూడింతలు పెంచి మా జీవితాల్లో మార్పులు తెచ్చారు. మేము ఊహించని విధంగా వేతనాలు పెంచడంతో సంతోషంగా ఉంది. ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – టి.కుమారి

మా సేవలను ప్రభుత్వం గుర్తించింది



మేము చేస్తున్న ఉద్యోగానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. గత ప్రభుత్వానికి ఎన్నో సార్లు విన్నవించాం. అయినా స్పందన లేదు. పనిచేయడమే తప్ప వేతనాల్లో మాత్రం మార్పులేదు. ఇబ్బందులు పడ్డాం. అయితే జగనన్న ప్రభుత్వం రిసోర్స్ పర్సన్లను గుర్తించింది. చిన్న పోస్టు అయినా గుర్తించి వేతనాలు పెంచింది. చాలా సంతోషంగా ఉంది. – ఇంద్ర భవానీ

ఆర్థిక భరోసా కల్పించింది



మా కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పించింది. గత ప్రభుత్వంలో చాలీచాలనీ వేతనాలతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కసారిగా వేతనం రూ.10 వేలు చేశారు. ఆర్థికంగా కష్టాల నుంచి బయట పడ్డాం. ఎప్పటికీ సీఎంకు రుణపడి ఉంటాం. – జి.రామతులసీ


వివేకానంద కేంద్రం కన్యాకుమారి కర్నూలు బ్రాంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగాసనాలు వేస్తున్న జిల్లా వినియోగదారుల ఫోరం చైర్మన్ కె.కిశోర్‌కుమార్


పతంజలి సాయినాథ్ యోగా కేంద్రంలో..



మెడికవర్ హాస్పిటల్‌లో మాట్లాడుతున్న యోగా ఇన్‌స్ట్రక్టర్ శేషఫణి

ఆరోగ్య 'యోగ'ం

- ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు
- యోగాసనాలు సాధన చేసిన యోగాభ్యాసకులు


ఇండస్‌లో యోగాసనాలు వేసిన విద్యార్థులు


రవీంద్ర మహిళ ఇంజనీరింగ్ కాలేజీలో యోగాసనాలు వేసిన విద్యార్థులు


ఇందిరాగాంధీ స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు


ఉస్మానియా కళాశాలలో యోగాసనాలు

కర్నూలుకల్చరల్/హాస్పిటల్/న్యూసిటీ/సిటీ/రూరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవాలు కర్నూలు నగరంలోని పలు చోట్ల పండుగలా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో తమ విద్యార్థులతో యోగాసనాలు వేయించి యోగా గురువుతో యోగా వల్ల కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. నిత్యం యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, దీర్ఘకాలిక రోగాల నివారణకు యోగా దివ్య ఔషధమని గురువులు వివరించారు.

- శ్రీ పతంజలి సాయినాథ్ యోగా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో వీఆర్ కాలనీలో వేడుకలు జరిగాయి. యోగా గురువు పెరుమాళ్ల దత్తయ్య, కార్యదర్శి రేగూరు బాలకృష్ణ, సభ్యులు కేశవయ్య తదితరులు పాల్గొన్నారు.
- నగర శివారులోని విజ్ఞాన పీఠం ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవం నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కురుడి సురేష్ యోగ ప్రాధాన్యతను వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ పి.జి.గురుమూర్తి పాల్గొన్నారు.
- కర్నూలు ఇంటర్నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్‌స్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడ్‌షప్పర్డ్ ఇంగ్లీష్ పాఠశాలలో యోగా డే నిర్వహించారు.
- స్థానిక యునాని మెడికల్ కాలేజీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యునాని మెడిసిన్ క్లినికల్ రీసెర్చ్ యూనియన్ ప్రాంగణంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో యోగా నిపుణులు కుళ్లాయప్ప యోగా ప్రాముఖ్యతను వివరించారు.


ఆర్‌యూలో మాట్లాడుతున్న వీసీ ఆచార్య ఎ.ఆనందరావు

యూనిట్ ఇన్‌చార్జ్ డాక్టర్ జవాదుల్ హక్ తదితరులు పాల్గొన్నారు.

- మెడికవర్ హాస్పిటల్‌లో జరిగిన యోగా దినోత్సవంలో యోగా అండ్ వెల్‌నెస్ ఇన్‌స్ట్రక్టర్ శేషఫణి, హాస్పిటల్ సెంటర్ హెడ్ నీలారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- రాయలసీమ యూనివర్సిటీలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఇన్‌స్ట్రక్టర్ పి.ఉమారాణి యోగా ఆసనాలను వేయించారు. వీసీ ఎ.ఆనందరావు,రిజిస్ట్రార్ సునందరానందపుచ్చ పాల్గొన్నారు.
- డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో కలిసి రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాసులు యోగాసనాలు వేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జేఎండీ షఫీ పాల్గొన్నారు.
- ఇండస్ స్కూల్‌లో జరిగిన యోగా వేడుకల్లో డైరెక్టర్ రాజశేఖర్, కరస్పాండెంట్ డాక్టర్ గాయని రాజశేఖర్ తదిరులు పాల్గొన్నారు.
- నగర శివారులోని జి.పుల్లయ్య, రవీంద్ర మహిళా ఇంజినీరింగ్ కాలేజీల్లో జరిగిన వేడుకల్లో స్పెషల్ ఆఫీసర్ పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.
- జగన్నాథగట్టుపై ఉన్న ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన వేడుకల్లో వివేకానంద కేంద్ర విభాగ్ సాహితీ సేవ ప్రముఖ్ ఎస్.శివప్రసాద్‌రావు, యోగా మాస్టర్ బి.అమరేష్, ట్రిపుల్‌ఐటీ సిబ్బంది పాల్గొన్నారు.
- ఇందిరాగాంధీ స్మారక నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యోగా డే వేడుకల్లో ఆంధ్రా మెడికల్ బెటాలియన్ కమాండర్ వైవీకే రెడ్డి, యోగా శిక్షకుడు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఉస్మానియా కళాశాలలో యోగా గురువు నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ సమీ ఉద్దీన్, ముజమ్మిల్, గజని పాల్గొన్నారు.
- ఎ.క్యాంప్ మాంటిస్సోరి స్కూల్‌లో 9వ ఆంధ్రా గర్ల్స్ బెటాలియన్ ఆధ్వర్యంలో యోగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కల్నల్ సురేష్ కాళీ, యోగా గురువు వై.శ్రీనివాసరెడ్డి, వివిధ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.


ఉర్దూ యూనివర్సిటీలో యోగాసనాలు వేస్తున్న రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు, విద్యార్థులు


యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు


మాంటిస్సోరి స్కూల్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

కోలుకోలేక యువకుడి మృతి

కర్నూలు(హాస్పిటల్): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శరీన్‌నగర్‌కు చెందిన భానుప్రకాష్(23) కోలుకోలేక బుధవారం మృతి చెందాడు. భానుప్రకాష్ డీజే మెకానిక్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 18న రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అబ్బాస్‌నగర్ ఎదురుగా ఉన్న జాతీయ రహదారిపై లారీ ఢీకొంది. ప్రమాదంలో గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం పెద్దాస్పత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఫుట్‌బాల్ క్రీడను ఆదరించాలి


పోటీలను ప్రారంభిస్తున్న మహబూబ్ బాషా

కర్నూలు (రూరల్): ఫుట్‌బాల్ క్రీడను ఆదరించాలని క్రీడాశాఖ సీఈఓ రమణ సూచించారు. బుధవారం నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో నరసింహులు మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను క్రీడాశాఖ సీఈఓ రమణ, అసిస్టెంట్ కమాండెంట్ మహబూబ్ బాషా, వన్‌టౌన్ సీఐ నాగశేఖర్, టూటౌన్ సీఐ శ్రీనివాసులు, సీఐడీ సీఐ నాగేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు, శిక్షకులు శ్రీను, జగదీష్, బ్రహ్మ, విజయ్‌కుమార్, నారాయణ, బాషా పాల్గొన్నారు.

సామాజిక న్యాయం జగన్‌తోనే సాధ్యం


మాట్లాడుతున్న సుభాష్‌చంద్రబోస్

కర్నూలు(రాజ్‌విహార్): సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాష్ చంద్రబోస్ అన్నారు. బుధవారం బిర్లా కాంపౌండ్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నామినేటెడ్ పదవులు ఇవ్వడంలో బలహీన వర్గాలకు తీరని అన్యాయం చేసిందన్నారు. ప్రస్తుత మంత్రి వర్గంలో సీఎం జగన్ బడుగులకు సముచిత స్థానం కల్పించడంతో పాటు 56 కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి నామినేటెడ్ పదవులు ఇచ్చారన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, నాయకులు రాజు,నాయుడు, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



ఆసుపత్రి ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ కోరారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పెద్దాస్పత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో కనీసం ఎక్స్‌రే మిషన్లు రిపేరీ చేయించాలన్నారు. బ్యాండేజ్ క్లాత్, గ్లౌజులు సైతం బయటకే రాస్తుండటం తగదన్నారు. ఆసుపత్రిలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని ఆరోపించారు. వీటిని అధికారులు పర్యవేక్షించకపో గా ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. అనంతరం వారు సూపరింటెండెంట్ కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రాధాకృష్ణ, నగర కార్యదర్శులు రాముడు, ఎం.రాజశేఖర్, నాయకులు అబ్దుల్లా,విజయ్, షరీఫ్, రామకృష్ణ, మహమూద్, సాయిబాబా, నరసింహులు పాల్గొన్నారు.

విద్యాసదస్సునుజయప్రదం చేయండి


కరపత్రాలను విడుదల చేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయ, ఉద్యోగ సమస్యలపై ఈనెల 25న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న జాతీయ విద్యా సదస్సును జయప్రదం చేయాలని ఫ్యాప్టో నాయకులు కోరారు. బుధవారం స్థానిక సలాంఖాన్ భవనంలో జరిగిన సమావేశంలో సదస్సు కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో కో-చైర్మన్ ప్రకాష్‌రావు మాట్లాడుతూ జిల్లా నలుమూలల నుంచి భారీ ఎత్తున ఉపాధ్యాయులు తరలి వచ్చి సదస్సును విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎస్.గోకారి, కార్యదర్శి గట్టు తిమ్మప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కర్నూలు(అగ్రికల్చర్): రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యతపై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు విద్యాశాఖ మండల అధికారుల చేత బహుమతులు ప్రదానం చేయించింది. కల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన క్విజ్ పోటీలను ఎల్‌డీఎం రామచంద్రరావు పరిశీలించారు. విజేతలకు బహుమతులు అందజేసి ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మండల స్థాయిలో విజేతలకు ఈనెల 28న జిల్లా స్థాయిలో పోటీలు జరుగుతాయి.

ఉద్యోగ భద్రత కల్పించాలి


నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైం ఫ్యాకల్టీ

కర్నూలు(సెంట్రల్): కేజీబీవీల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం ఫ్యాకల్టీకి ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జే.నాగేశ్వరరావు, ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి విజయ్ డిమాండ్ చేశారు. జిల్లాలోని కేజీబీవీల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉద్యోగులు బుధవారం కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట ధర్నా నిర్వహించారు. వీరికి మద్దతుగా నాగేశ్వరరావు, విజయ్ మాట్లాడుతూ పార్ట్ టైం ఫ్యాకల్టీని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా మార్పు చేయాలన్నారు. పనికి తగిన వేతనం ప్రకారం నెలకు రూ.26,750 చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పార్ట్‌టైం ఫ్యాకల్టీ నీలమ్మ, సోఫియా, రంజిత, శీలలిత, లలితాదేవి, షకీలా, లీలమ్మ, శివలక్ష్మి, హేమలత పాల్గొన్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

కర్నూలు: మద్యం మత్తులో కారుతో స్కూటర్‌ను ఢీకొట్టిన ఎంబీఏ విద్యార్థి అక్కలదేవి అజయ్‌బాబుకు 14 రోజులు రిమాండ్‌కు ఆదేశిస్తూ కర్నూలు ఎక్సైజ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈనెల 19న అజయ్‌బాబు కారు నడుపుకుంటూ బళ్లారి చౌరస్తా పై ఓవర్ బ్రిడ్జి వద్ద ముందు వెళ్తున్న స్కూటీని ఢీకొట్టడతో కొండూరు రమేష్ తీవ్ర గాయాలకు గురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందాడు. ప్రమాదానికి కారకుడైన అజయ్‌బాబు మద్యం తాగిఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు గుర్తించి, డాక్టర్ చేత ఆల్కహాల్ టెస్ట్ చేయించి కేసు నమోదు చేసి బుధవారం కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు ఆదేశిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. దీంతో అతనిని పంచలింగాల జైలుకు తరలించినట్లు ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం తెలిపారు.

మహిళ వద్ద సొత్తు చోరీ

కర్నూలు(హాస్పిటల్): బ్యాంకులో డబ్బు జమ చేయడానికి నిలబడిన ఓ మహిళ సొత్తు చోరీకి గురైంది. నిడ్జూరు గ్రామానికి చెందిన లక్ష్మికి స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో సేవింగ్స్ అకౌంట్ ఉంది. బుధవారం మధ్యాహ్నం ఆమె బ్యాంకులో రూ.50 వేలు జమచేసేందుకు క్యూలో నిల్చుండగా నగదు చోరీకి గురైంది. సీసీ పుటేజీని పరిశీలించగా బాధితురాలి వెనుక బురఖా వేసుకుని నిల్చున్న ఓ మహిళ తస్కరించినట్లు గుర్తించి వన్‌టౌన్ పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.